
# గిలకల బావి

ఎ. రాజాహుస్సేన్

**ఇప్పుడైతే మా వూరికి మున్సిపాల్టీ నీళ్లొస్తున్నాయి కానీ నా చిన్నతనంలో గిలకల బావే ఊరందరి దాహం తీర్చేది. రెండు తాటిచెట్లు కలిస్తే ఎంత లోతుంటుందో అంత లోతుండేది గిలకల బావి. బావికి నాలుగు పక్కలా రెండేసి వంతున చెక్కగిలకలుండేవి. మా పక్క ఊర్లన్నీ కోడికూతతో మేల్కొంటే మా ఊరు మాత్రం కిర్రుకిర్రుమనే గిలకల శబ్దంతో మేలుకునేది. అందుకే బావి గిలకల్ని చూస్తే మా ఊరి కోళ్లకు మా గుర్రుగా ఉండేది.**

సింగిల్ పేజి కథ

దూరప్రాంతాల నుంచి జనం కావళ్లు వేసుకొని నీళ్లకోసం వస్తుంటే ఆకాశంలో కొంగలు బారులు తీరినట్లుండేది. భుజాన కావడిబద్ద వేసుకొని ఖాళీ బిందెల్తో వస్తున్నప్పుడు ఆడుతూ పాడుతూ కనిపించే వారు. బిందెలు నింపుకొని కావడి భుజాన ఎత్తుకున్న దగ్గర్నుంచి నీళ్లబరువుకు పరుగు లంఘించుకునేవారు. రెండువైపులా బరువుతో భుజంపైన కావడి బద్ద స్ప్రింగులా కిందికి పైకి వంగుతుంటే ఆ ఒంపు సొంపులు చూడాల్సిందే కాని మాటల్లో వర్ణించలేం. బిందె భుజాన పెట్టుకొని నీళ్లకోసం వస్తున్న ఆడాళ్లు ఎదురైనపుడు కావడి మోస్తున్న కుర్రకారులో ఉత్సాహం మరింత రెట్టింపయ్యేది. నడక వేగం పెరిగిన కొద్దీ నురగలు గక్కినట్లు చెమట ఒంటిపై నుండి జారిపడేది. బావి దగ్గర నీళ్లు చేదేటపుడు కూడా అమ్మాయిల బిందెల్ని నింపటంలో కుర్రకారు పోటీపడేవారు. నింపిన బిందె అమ్మాయిల భుజంపైకి ఎత్తిపెట్టే ఛాన్సు కోసం కుర్రకారు కాసుకొనివుండటం నాకింకా గుర్తుంది.



ఉదయమైతే చాలు చిలకలు వాలిన చెట్టులా వుండే గిలకల బావి అప్పుడప్పుడూ అస్త్రసన్యాసం చేసిన అర్జునుడిలా అగుపించేది. మనుషులకే కాదు మా బావికీ ఫిలాసఫీ ఉండేది. ఎంతోమంది జనం దప్పిక తీర్చేటమే కాదు, జీవితంపై విరక్తి కలిగిన వాళ్లకు అప్పుడప్పుడు మోక్షాన్ని కూడా ప్రసాదించేది. కట్నం తేలేదని అత్త మామలు, ఆడబిడ్డ చేసే ఆరళ్లకు విసిపోయిన ఇల్లాళ్లు, అప్పుల బాధ భరించలేక జీవితాన్ని ముగించాలనుకున్న అప్పారావులు, అక్రమ సంబంధాలతో సమాజంలో మొఖం చూపలేని సుబ్బారావుల సమస్యలకు పరిష్కారం చూపే గొప్ప ఫిలాసఫర్ మా గిలకల బావి. అందుకే గిలకల బావిని చూసినప్పుడల్లా ప్రేమతో లాలించి, కోపంతో మందలించి అక్కున చేర్చుకునే 'అమ్మ' గుర్తొచ్చేది.

గిలకల బావి మరో ప్రత్యేకత ఏమిటంటే ప్రేమికుల జంటల కలయిక స్థలంగా కూడా ఉపయోగపడేది. ఇప్పుడైతే పార్కులు, కంప్యూటర్ హబ్బులు, పబ్బులూ ఉన్నయికానీ ఆ రోజుల్లో గిలకల బావొక్కటే ప్రేమికుల స్పాట్‌గా ఉండేది. నీళ్ల అవసరమున్నా లేకున్నా ప్రేమికుల జంటలు ఖాళీ బిందెల్తో గిలకల బావి దగ్గరకు చేరుకొని సైగలతోనే మాట్లాడుకునేవారు.

ఓ రోజు గిలకల కిర్రుశబ్దాలు లేకుండానే మా ఊర్లో తెల్లారింది. జనమంతా బిలబిలమంటూ బావి దగ్గరకు చేరి ఆత్రుతతో లోపలికి తొంగిచూసారు. నీళ్లపై కనిపించీ కనిపించకుండా ఓ స్త్రీ శవం తేలుతోంది. ఎవరై ఉంటారు? ఎవరై ఉంటారని జనం ఒకళ్లనొకళ్లను ప్రశ్నించటం, కొందరైతే ఫలానా అయివుండొచ్చని ఊహాగానాలు కూడా చేశారు. ఆ రోజు మధ్యాహ్నం దాకా జనం ఇళ్లల్లో వంట కూడా చేసుకోలేదు. పోలీసులు వచ్చి శవాన్ని బయటకు తీసి 'ఫలానా' అని తేల్చింతర్వాత గానీ పొయ్యి రాజెయ్యలేదు.

శవం కారణంగా మరుసటిరోజు వరకూ ఎవరూ నీళ్లకోసం బావి దగ్గరకు రాలేదు. మూడు రోజులు శవం నీళ్లలో వుండటంతో కుళ్లి, నీళ్లు వాసన కొడ్తున్నాయన్న ప్రచారం ఊరందరి నోళ్లలో నానటంతో పెద్దలంతా కలిసి మోటారు పెట్టి నీళ్లు తోడే కార్యక్రమాన్ని మొదలు పెట్టించారు. ఎంత తోడినా నీళ్లు తరగటం లేదు. మోటారు అద్దె, డీజిల్ ఖర్చు తడిసి మోపెడు కావటంతో నీళ్లు తోడే కార్యక్రమానికి ఫుల్‌స్టాప్ పెట్టారు. గిలకల బావి మూత పడేసరికి అరకిలోమీటరు దూరంలో వున్న కోసూరి తోట బావి దగ్గర్కు జనం పరుగులు తీసేవారు. కోసూరి బావికి గిలకలు ఉండేవి కావు. తాడిమొద్దును బావిపై అడ్డంగా వేసి దానిపై ఒక కాలు, నేలపై మరో కాలు పెట్టి ఒంగి నీళ్లను చేదాల్సి వచ్చేది. అందువల్ల ఈ బావి దగ్గరకు అమ్మాయిల్ని పంపించేవాళ్లు కాదు. అమ్మాయిలు రారని తెలిసి కుర్రకారు కోసూరు బావికి రావడానికి ఇష్టపడేవాళ్లు కారు.

శవం తేలిన రోజు నుంచి నాలుగైదు రాత్రులు సెకండ్ షో సినిమాలకు కలెక్షన్లు తగ్గేవి. పంచాయితీ వీధి దీపాలు లేకపోవటంతో బావి పక్క నుంచి దాటిపోవడానికి జనం భయపడే వారు. "బావిలో పడి చనిపోయినవారు దయ్యమై తిరుగుతుంటారు జాగ్రత్త" అంటూ పెద్దలు భయపట్టేవాళ్లు.

నాలుగైదు రోజులు గడిచాక దిక్కులేక గిలకల బావి దగ్గర నుంచి నీళ్లు చేదుకొని తెచ్చుకునేవారు. ఒకరిని చూసి మరొకరు క్రమంగా గిలకల బావి జనసమ్మర్ధంతో నిండి మళ్లీ నిండు ముత్తయిదువులా అగుపించేది. గిలకల కిర్రు శబ్దం మళ్లీ వినిపించేసరికి కుర్రకారు మూలనున్న కావడి బద్దల్ని సరిచేసుకొని నీళ్లకు బయలుదేరేవారు.

ఇప్పుడు మా ఊరికి మున్సిపల్ పంపులు వచ్చేశాయి. ఇళ్లల్లో మున్సిపల్ కనెక్షను పెట్టించుకోవటంతో గిలకల బావికి పని లేకుండా పోయింది. తిరగని గిలకల్ని ఒకరోజు ఎవరో ఎత్తుకుపోయారు. ఊరంతటి దాహాన్ని తీర్చిన మా గిలకల బావి ఇప్పుడు సుదీర్ఘ తపస్సులో వున్న మునిలా వుంది. బావిలో పాచి, చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. ఇప్పుడటువైపు వెళ్లే అవసరం ఎవరికీ లేదు. మా ఊరు వెళ్లినప్పుడల్లా గిలకల కిర్రుశబ్దం వినాలని వున్నా సాధ్యం కాదని తెలిసి మనసు చివుక్కుమంటుంది. ■